నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I | హైదరాబాద్, మంగళవారం 15 అక్టోబర్ 2024 | HYDERABAD

రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న వక్తలు

తండ్రీకొడుకులపై వీధి కుక్కల దాడి

అధికారుల నిర్లక్ష్యం వల్లే వీధి కుక్కల స్వైరవిహారం

దుండిగల్, అక్టోబర్14: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని బౌరంపేటలో ఆదివారం రాత్రి తండ్రీ కొడుకుపై వీధి కుక్కలు దాడి చేశాయి. పనిమీద బయటకు వెళ్లిన కుమ్మరి మల్లయ్య కుమారుడిని తీసుకొని ఇంటికి వస్తుండగా, వీధి కుక్కలు దాడి చేయడంతో గాయాలయ్యాయి. మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం వల్లే వీధి కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయని స్థానికులు మండిపడుతున్నారు. వెంటనే వీధి కుక్కల బెడద లేకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పర్యావరణానికి పెను ముప్పు

అడవులను నాశనం చేస్తే మనుగడ అసాధ్యం

వీఎల్ ఎఫ్ ప్రాజెక్టుతో ప్రధాని, సీఎం బంధం బయటపడింది

రాహుల్ గాంధీ స్పందించాలి

రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

వికారాబాద్ జిల్లా పూడూరు మండలంలోని దామగుండంలో భారతీయ నావికా విభాగం కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో నిర్మిస్తున్న వెరీ లో ఫ్రీక్వెన్సీ ప్రాజెక్టు వల్ల మానవ మనుగడే అసాధ్యమవుతుందని వక్తలు అభిప్రాయపడ్డారు.

-ఖైరతాబాద్, అక్టోబర్ 14

సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జర్నలిస్టు సంపత్ అధ్యక్షతన జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో రాడార్ ప్రాజెక్టు వల్ల ప్రజలు, పర్యావరణానికి జరిగే నష్టాలు, ప్రకృతి వైపరీత్యాలపై వక్తలు మాట్లాడారు. సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు వల్ల ఇప్పటికే భద్రాచలంలో నవగ్రహ ఆలయం, పర్ణశాల మునిగిపోయే ప్రమాదం ఏర్పడిందన్నారు. యావత్ ప్రజానీకానికి, పర్యావరణానికి నష్టం చేకూర్చే వీఎల్ఎఫ్ ప్రాజెక్టు నిర్మాణాన్ని విరమించుకోవాలన్నారు. ఒక చెట్టుకు పది చెట్లు నాటుతామని చెబుతున్నా..అది సాధ్యం కాదన్నారు. ప్రాజెక్టు పేరుతో సహజ వనరులను దెబ్బతిస్తున్నారని, ఇందులో పాలకులు మతలబు వేరే ఉంటుందన్నారు. దామగుండం నిర్మాణం జరిగితే ప్రజలే మునిగిపోతారని అన్నారు.

సముద్ర తీరాలను ఎంచుకోవాలి

పర్యావరణవేత్త ప్రొఫెసర్ బాబురావు మాట్లాడుతూ దామగుండం ప్రాజెక్టు వల్ల పర్యావరణం దెబ్బతింటుందని, ఉన్న అడవులను నాశనం చేసుకుంటూ పోతే మానవ మనుగడే ప్రశ్నార్థకమవుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టే ఈ ప్రాజెక్టుతో స్థానికులకు ఎలా ఉద్యోగాలు వస్తాయని ప్రశ్నించారు. ప్రొఫెసర్ వినాయక్‌రెడ్డి మాట్లాడుతూ ఇలాంటి ప్రాజెక్టులకు సముద్ర తీరాలను ఎంచుకోవాలని, కానీ ప్రజల మధ్య ప్రాజెక్టును నిర్మిస్తామనడం సరికాదన్నారు. పీవోడబ్ల్యూ నాయకురాలు సంధ్య మాట్లాడుతూ దామగుండంలో 2,900 ఎకరాల్లో ఔషధ మొక్కలు ఉన్నాయని, అక్కడ దేవాలయానికి సంబంధించిన 1,400 ఎకరాల భూమిని ఇప్పటికే కోల్పోయారని, ఈ ఆలయంలోని గుండంలో 8.5 పీహెచ్ కలిగిన నీరు ఉందని, అందులో ఔషధ గుణాలున్నాయన్నారు. అడవి పోతే మరో అడవిని తయారు చేస్తామంటున్నారని, అడవి అనేది సహజంగా ఏర్పడుతుందని, కృత్రిమంగా తయారు చేస్తే అది జీవ వైవిధ్యాన్ని తిరిగి తెచ్చిపెట్టలేదని అన్నారు. రాష్ట్రంలోని చెట్లు పెరగని ప్రాంతాల్లో ఈ ప్రాజెక్టును నిర్మించుకోవాలన్నారు.

ప్రజాభిప్రాయం ఎందుకు సేకరించలేదు..

తెలంగాణ విఠల్ మాట్లాడుతూ ప్రజల మధ్య, ప్రకృతివనంలో రాడార్ స్టేషన్ నిర్మించాలనుకుంటే అక్కడ గ్రామసభలు, డిబేట్లు ఎందుకు నిర్వహించలేదని, ప్రజాభిప్రాయం ఎందుకు సేకరించలేదని ప్రశ్నించారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లోనే ఈ ప్రాజెక్టును వ్యతిరేకించారని, అలాంటప్పుడు కాంగ్రెస్ పాలిత రాష్ట్రంలో కేంద్ర ప్రభుత్వం రాడార్ స్టేషన్‌ను ఎందుకు నిర్మిస్తున్నారని ప్రశ్నించారు. బడాబాబులకు ఉపయోగపడే ఈ ప్రాజెక్టు నిర్మాణంతో ప్రధాని మోదీ, సీఎం రేవంత్ రెడ్డి బంధం బయటపడిందన్నారు. దీనిపై రాహుల్ గాంధీ స్పందించాలన్నారు. క్లైమెట్ ఫ్రంట్ ప్రతినిధి రుచిత్ మాట్లాడుతూ గత ఐదేండ్ల నుంచి దామగుండాన్ని పరిశీలిస్తున్నామని, 12 లక్షల మొక్కలు తొలగించడం వల్ల జీవ వైవిధ్యం దెబ్బతింటుందని, అయితే ఫారెస్టు అధికారుల వద్ద సరైన డాటా కూడా లేదని, ఎన్ని లక్షల చెట్లు తొలగిస్తున్నారో ఆన్‌లైన్‌లో ఎందుకు పెట్టలేదని ప్రశ్నించారు. మంత్రి కొండా సురేఖ ఒక్క చెట్టునూ తొలగించడం లేదంటే, ఫారెస్టు అధికారులు మాత్రం ఒక లక్ష చెట్లను తొలగిస్తున్నట్లు చెబుతున్నారన్నారు. మంత్రికి అధికారుల మధ్య సమన్వయం లేదని చెప్పారు. ఈ అడవికి బదులు 17 లక్షల చెట్లు నాటుతామని చెబుతున్నారని, అది ఫెయిల్యూర్ ప్రక్రియ అని అన్నారు. ఈ సమావేశంలో తెలంగాణ క్రాంతి దళ్ అధ్యక్షుడు పృథ్వీరాజ్ యాదవ్, జర్నలిస్టు తులసి చందు తదితరులు పాల్గొన్నారు.

బదిలీల్లో భారీ అవినీతి!

- మార్గదర్శకాలకు తిలోదకాలు
- చేతులు మారిన లక్షలాది రూపాయలు
- కోరుకున్న చోటుకు పోస్టింగ్
- దక్షిణ డిస్కంలో 1126 మంది బదిలీ
- పెద్ద ఎత్తున పనిచేసిన లాబీయింగ్?

అవినీతికి చోటు లేకుండా ఎంతో పారదర్శకంగా బదిలీ ప్రక్రియను చేపడుతున్నామని, అందుకోసం ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను రూపొందించి, వెబ్ కౌన్సెలింగ్‌ను ఎంప్లాయీస్ పోర్టల్ ద్వారా నిర్వహించామని ప్రకటించారు. బదిలీ కోసం ప్రత్యేకంగా రూపొందించిన మార్గదర్శకాలను లెక్క చేయకుండానే కొన్ని పోస్టులను తాము అనుకున్న వారికి అప్పగించేశారు. మొత్తంగా బదిలీల ప్రక్రియలో పెద్ద మొత్తంలో డబ్బులు చేతులు మారినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. బదిలీలతో అసంతృప్తికి గురైన కొందరు ఉద్యోగులు ఖైరతాబాద్‌లోని దక్షిణ డిస్కం కార్యాలయానికి వచ్చి ఉన్నతాధికారులను కలిసేందుకు ప్రయత్నించినా అందుబాటులో లేకుండా పోయారు. తాజాగా సోమవారం దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థలో జరిగిన బదిలీల ప్రక్రియలో మొత్తం 1126 మందిని బదిలీ చేసినట్లు డిస్కం అధికారులు ప్రకటించారు. ఇందులో డీఈలు 111, ఏడీఈలు 263, ఏఈలు 521, ఇతర ఉద్యోగులు 231 పోస్టులకు సంబంధించిన బదిలీల ప్రక్రియ పూర్తయిందని తెలిపారు. బదిలీ జాబితాను నేరుగా ఉద్యోగులకే మెయిల్ ద్వారా సందేశాలు పంపించి, బయటకు మాత్రం బహిర్గతం చేయలేదు. బదిలీల జాబితా బహిరంగంగా ప్రకటించాల్సిన అధికారులు తాము చేసిన తప్పులను కప్పి పుచ్చుకునేందుకే ఇలా చేశారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అందరి టార్గెట్ ఫోకల్ పోస్టులే..

బదిలీల ప్రక్రియ చాలా పారదర్శకంగా జరిగిందని ప్రకటిస్తున్నా... తెరవెనుక మాత్రం విద్యుత్ శాఖ మంత్రి అనుచరులు పెద్ద ఎత్తున లాబీయింగ్ చేసి నచ్చిన ప్రాంతానికి పోస్టింగ్ వచ్చేలా చేయించారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఫోకల్ పోస్టుల్లో ఇప్పటి వరకు పనిచేసిన వారికి మళ్లీ ఫోకల్ పోస్టులకు బదిలీ చేయకుండా మార్గదర్శకాలను రూపొందించారు. ఈ నిబంధనలను తుంగలో తొక్కి కీలకమైన పోస్టుల్లో పనిచేసిన వారికి మళ్లీ అలాంటి కీలక పోస్టుల్లోనే పోస్టింగ్ ఇచ్చారు. అందుకు ప్రత్యేక ఉదాహరణ కార్పొరేట్ కార్యాలయంలో డీఈ కమర్షియల్ ఈడీగా పనిచేస్తున్న అధికారిని మేడ్చల్ సర్కిల్ పరిధిలోని డీఈ ఆపరేషన్స్ పోస్టుకు బదిలీ చేశారు. ఇలా ఈ ఒక్క పోస్టు మాత్రమే కాదు.. పదుల సంఖ్యలోనే ఉన్నాయి. ఫోకల్ పోస్టుల్లో పోస్టింగ్‌కు రూ. 20 లక్షల నుంచి రూ. 80 లక్షల వరకు చేతులు మారినట్లు సమాచారం. ఈ బదిలీల్లో ఆ శాఖ మంత్రి అనుచరులు ఎక్కువగా ఒత్తిడి తీసుకువచ్చి 20 నుంచి 30 పోస్టుల వరకు పైరవీలు చేసినట్లు విద్యుత్ శాఖ ఉద్యోగులు పేర్కొంటున్నారు.

విద్యుత్ శాఖలో బదిలీల మార్గదర్శకాలకు తిలోదకాలు ఇచ్చారు. కోరుకున్న వారికి కోరుకున్న చోటుకు పోస్టింగ్ అనే నినాదం... అక్షరాల నిజమైంది. -సిటీబ్యూరో

యూనియన్ నాయకులకు ఫోకల్ పోస్టులు..

బదిలీల కోసం రూపొందించిన మార్గదర్శకాల ప్రకారం విద్యుత్ ఉద్యోగ సంఘాల్లో నాయకులుగా ఉన్న వారికి ఫోకల్ పోస్టింగులు ఇవ్వకూడదు. కానీ తాజాగా జరిగిన బదిలీల్లో యూనియన్ నాయకులకు సైతం ఒకటి, రెండు చోట్ల పోస్టింగులు ఇచ్చినట్లు తెలిసింది. ఈ విషయంలోనూ సచివాలయం స్థాయిలో పైరవీలు చేసి, కావాల్సిన పోస్టును సొంతం చేసుకున్నారు.

ఫోకల్ టు ఫోకల్..

1. డీఈ కమర్షియల్ (కార్పొరేట్ ఆఫీస్) నుంచి డీఈ ఆపరేషన్స్ (మేడ్చల్)
2. ఏఈ (ఆపరేషన్)పటాన్‌చెరు నుంచి ఏఈ నార్సింగి
3. ఏఈ గచ్చిబౌలి నుంచి ఏటీ టెక్నికల్ గచ్చిబౌలి
4. ఏడీఈ బైరామల్‌గూడ నుంచి ఏడీఈ ఫుట్‌కేసర్

ఒకే డివిజన్ పరిధిలో బదిలీలు..

బదిలీల కోసం రూపొందించిన మార్గదర్శకాల ప్రకారం ఒకే డివిజన్‌లో పనిచేసిన వారికి అదే డివిజన్‌లో పోస్టింగ్ ఇవ్వకూడదు. కానీ ఆ నిబంధనను పట్టించుకోకుండా ఏడీఈ ఆపరేషన్ పటాన్‌చెరువు నుంచి ఏడీఈ ఆపరేషన్ గుమ్మడిదలకు బదిలీ చేశారు. ఇది ఒకే డివిజన్‌లో పరిధిలో ఉంది. మార్గదర్శకాలకు విరుద్ధంగా ఈ బదిలీల ప్రక్రియ జరిగిందనానికి ఇదొక సాక్ష్యం. అదేవిధంగా డీఈ ఆపరేషన్ మేడ్చల్ నుంచి డీఈ టెక్నికల్ మేడ్చల్ పోస్టు సైతం ఒకే సర్కిల్‌లో ఉంది. ఈ పోస్టులు ఒకే సర్కిల్(మేడ్చల్)పరిధిలోని కావడం గమనార్హం. ఇలా గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని సర్కిళ్లు, డివిజన్ల, సెక్షన్‌లలో పరిధిలో జరిగిన బదిలీలు దక్షిణ డిస్కం రూపొందించిన బదిలీల మార్గదర్శకాలకు విరుద్ధంగా ఉన్నదని పలువురు ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. ఒకే డివిజన్‌లో 9 ఏండ్లుగా పనిచేస్తున్న అధికారిని అదే డివిజన్ పరిధిలోనే బదిలీ చేయడంపైనా పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆర్‌సీపురం ఏడీఈని ఇస్నాపూర్ ఏడీఈగా బదిలీ చేయడాన్ని కొందరు ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు.

ఫణిగిరికాలనీ వాసులతో మాట్లాడుతున్న ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

ఒక్క ఇటుకనూ కూల్చనివ్వం

మూసీ బాధితులకు అండగా ఉంటాం

ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

ఎల్బీనగర్, అక్టోబర్ 14: మూసీ పరీవాహక ప్రాంతంలోని ఇండ్లకు సంబంధించిన ఒక్క ఇటుకనూ కూల్చనివ్వమని, మూసీ బాధితులకు అన్ని విధాలుగా అండగా ఉంటామని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి భరోసా ఇచ్చారు. మూసీ ప్రాంతంలోని చైతన్యపురి డివిజన్ ఫణిగిరికాలనీలోని నివాసాలను అధికారులు కూల్చివేస్తారంటూ ఓ చానల్‌లో వార్త ప్రసారం కావడంతో భయాందోళనకు గురైన కాలనీవాసులు ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డిని ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి వివరించారు. ఈ మేరకు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ మూసీ పరీవాహక ప్రాంతంలోని నివాసితులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. మాజీ కార్పొరేటర్ విఠల్ రెడ్డి, నాయకులు పవన్, కడియం మోహన్ రాజ్, కాలనీవాసులు వేణుగోపాల్, వీరాచారి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ మోసం

కిలాడీ లేడీ అరెస్ట్

సిటీబ్యూరో, అక్టోబర్ 14 (నమస్తే తెలంగాణ): ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ నిరుద్యోగులను బురిడీ కొట్టిస్తూ లక్షల రూపాయలు దండుకున్న ఒక కిలాడీ లేడీని సైబరాబాద్ సైబర్‌క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. నిందితురాలి వద్ద నుంచి 9 స్మార్ట్‌ఫోన్లు, 6 కీ ప్యాడ్ ఫోన్లు, ల్యాప్‌టాప్, 10 సిమ్‌కార్డులు, 6 చెక్ బుక్‌లు, 4 డెబిట్ కార్డులు, కారును స్వాధీనం చేసుకున్నారు. సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ నరేంద్రారెడ్డి కథనం ప్రకారం.. కర్ణాటకకు చెందిన రేష్మ అలియాస్ స్వప్న 2009లో నగరానికి వలస వచ్చి, ఇన్‌స్టెంట్ ఐటీ జాబ్స్ కన్సల్టెన్సీలో టెలీకాలర్‌గా పనిచేసింది. అక్కడ మేనేజర్‌గా పనిచేసే మహ్మద్ అలీతో చనువు పెంచుకొని.. 2013లో అతడిని వివాహం చేసుకుని, 2022లో విడాకులు ఇచ్చింది. అదే సంవత్సరంలో మరో పెళ్లి చేసుకున్న రేష్మ ఉద్యోగాల పేరుతో మోసాలకు పాల్పడే క్రమంలో మాజీ భర్తతో సంబంధాలు కొనసాగిస్తున్నది. నిరుద్యోగులే లక్ష్యంగా ఫోన్ కాల్స్, ఆన్‌లైన్ మాధ్యమాల ద్వారా మోసాలకు పాల్పడుతున్నది. ఈ క్రమంలోనే 2023 సెప్టెంబర్‌లో నగరానికి చెందిన ఓ యువతికి ఫోన్ చేసి తనను తాను కాగ్నిజెంట్‌లో సీనియర్ హెచ్ఆర్ మేనేజర్‌గా పరిచయం చేసుకుంది. మల్టీనేషనల్ కంపెనీల్లో ఉద్యోగావకాశాలున్నట్లు తెలిపింది. ఇది నమ్మిన బాధితురాలు తనకు పరిచయం ఉన్న 9 మంది నిరుద్యోగుల రెస్యూమ్‌లను వాట్సాప్ ద్వారా నిందితురాలికి పంపింది. అయితే అడ్వాన్స్ పేమెంట్ చేస్తేనే ఉద్యోగాలను ఇప్పిస్తామని సుప్రీతి అనే మరో యువతి బాధితురాలికి తెలిపింది. ఇది నమ్మిన బాధితురాలు 9 మంది వద్ద నుంచి మొత్తం రూ.58,75,000 సేకరించి నిందితులు సూచించిన పలు బ్యాంకు ఖాతాలకు పంపించింది. డబ్బులు అందిన వెంటనే బాధితుల వాట్సాప్‌నకు వివిధ కంపెనీల నుంచి జాబ్ ఆఫర్ లెటర్స్‌ను పంపించారు. దీంతో వచ్చిన ఆఫర్ లెటర్స్ నిజమైనవే అనుకుని బాధితులు ఆయా కంపెనీలకు వెళ్లగా అవి నకిలీవని తేలింది. దీంతో మోసపోయినట్లు గ్రహించిన బాధితులు గత నెల 1న సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు జరిపిన పోలీసులు ఉద్యోగాల పేరుతో మోసాలకు పాల్పడుతున్న కిలాడి లేడీ రేష్మను సోమవారం అరెస్టు చేశారు. నిందితురాలిని గతంలో కూడా కర్ణాటక పోలీసులు అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. అంతే కాకుండా రేష్మపై తెలంగాణలో 5 కేసులు, కర్ణాటకలో 6, ఏపీలో 1 కేసు నమోదై ఉన్నట్లు పోలీసులు తెలిపారు. నిందితురాలికి మాజీ భర్తతో పాటు ఆజిల్ పాటిల్, ఫిర్దోస్‌లు సహకరిస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

ఖైరతాబాద్‌లోని జలమండలి ప్రధాన కార్యాలయంలో మాట్లాడుతున్న ఎండీ అశోక్‌రెడ్డి

ఇంకుడు గుంత లేని ఇండ్లకు నోటీసులు

జనవరి నుంచి ట్యాంకర్ బుక్ చేస్తే అదనపు చార్జీలు

జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి

సిటీబ్యూరో, అక్టోబర్ 14 (నమస్తే తెలంగాణ) : ఇంకుడు గుంత లేని ఇండ్లకు నోటీసులు జారీ చేయాలని జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం ఖైరతాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో ఉన్నతాధికారులతో కలిసి జలమండలి చేపట్టిన 90 రోజుల స్పెషల్ డ్రైవ్‌పై సమీక్షించారు. సీవరేజీ ఓవర్ ఫ్లో, కలుషిత నీరు, రోడ్లపై సిల్ట్ తదితర వాటిపై ఎంసీసీకి వచ్చే ఫిర్యాదులను ఆయా క్యాన్ నంబర్లను జీపీఎస్ ఆధారంగా గూగుల్ మ్యాప్‌లో నమోదు చేస్తున్నట్లు ఎండీ తెలిపారు. మ్యాన్‌హోళ్లలో తీసిన వ్యర్థాలను (సిల్ట్) డంపింగ్ యార్డుకు తరలించాలని, డ్రై బోర్‌వెల్స్‌పై కొనసాగుతున్న సర్వేను వేగవంతం చేయాలని చెప్పారు. వినియోగదారులు తమ ఇళ్లల్లో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని..లేకపోతే వారికి నోటీసులు జారీ చేయాలన్నారు. వచ్చే జనవరి నుంచి ట్యాంకర్ బుక్ చేస్తే అదనపు చార్జీలు వసూలు చేస్తామన్నారు. ఇందుకు సంబంధించిన సమాచారాన్ని వినియోగదారులకు ఎస్ఎంఎస్ రూపంలో పంపించడంతో పాటు నేరుగా వారికి పత్రాలు అందజేయాలన్నారు. ఈ సమావేశంలో డైరెక్టర్లు వీఎల్ ప్రవీణ్‌కుమార్, స్వామి, విజయరావు, సీజీఎంలు పాల్గొన్నారు.

గ్రేటర్‌కు వర్షసూచన

సిటీబ్యూరో, అక్టోబర్ 14 (నమస్తే తెలంగాణ): బంగాళాఖాతంలో ఏర్పడిన ఆవర్తనం ప్రభావంతో సోమవారం సాయంత్రం గ్రేటర్‌లోని పలు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వాన కురిసింది. రాత్రి 10 గంటల వరకు కుత్బుల్లాపూర్‌లో 2.20సెం.మీలు, పటాన్‌చెరువులో 2.18, కూకట్‌పల్లి శంషీగూడలో 1.53, గాజులరామారంలో 1.23, హైదర్‌నగర్‌లో 1.13సెం.మీల చొప్పున వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. బంగాళాఖాతంలో ఏర్పడిన ఆవర్తనం మరింత బలపడి వాయుగుండగా మారే అవకాశాలు ఉండటంతో రాగల మరో రెండు రోజులు గ్రేటర్ లోని పలు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు, మరికొన్ని చోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నట్లు వెల్లడించారు. భారీ వానల నేపథ్యంలో గ్రేటర్‌కు ఎల్లో అలర్ట్ హెచ్చరికలు జారీ చేశారు. నగరంలో గరిష్ఠం 31.0, కనిష్ఠం 3.6 డిగ్రీలు, గాలిలో తేమ 90 శాతంగా నమోదైనట్లు అధికారులు తెలిపారు.

దేవాలయాలపై వరుస దాడులు!

- ప్రజల మధ్య విద్వేషాలు సృష్టించే యత్నం
- జాడలేని విజుబుల్ పోలీసింగ్
- పెట్రోలింగ్ వ్యవస్థ గాలికి

సిటీబ్యూరో: కొన్ని వర్గాల మధ్య విద్వేషాలను రెచ్చగొట్టే వరుస ఘటనలు నగర ప్రజలను తీవ్ర ఆందోళనకు గురి చేస్తున్నాయి. ఒక ఘటన జరిగితే మళ్లీ అలాంటివి పునరావృతం కాకుండా పోలీసులు పకడ్బందీ చర్యలు తీసుకోవాల్సి ఉన్నా.. ఆ దిశగా అడుగులు ఉండటం లేదన్న విమర్శలున్నాయి. సోమవారం సికింద్రాబాద్ ముత్యాలమ్మ ఆలయంలోకి దుండగుడు చొరబడి విగ్రహాన్ని ధ్వంసం చేసిన ఘటన కలకలం సృష్టించింది.

సికింద్రాబాద్ ముత్యాలమ్మ ఆలయం వద్ద గుమిగూడిన భక్తులు

భయాందోళనలో నగరవాసులు

హైదరాబాద్‌లో వర్గాల మధ్య చిన్న పాటి గొడవ జరగకుండా బీఆర్ఎస్ పదేండ్ల పాలన సాగింది. అదే స్ఫూర్తితో పనిచేయాల్సిన పోలీసులు.. ప్రభుత్వం మారగానే అప్పుడు చేసిన సంస్కరణలు మేమెందుకు పాటించాలనే ధోరణితో హైదరాబాద్ పోలీసింగ్‌ను మార్చేశారన్న విమర్శలున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లోనే నగరంలో కలహాలకు దారితీసే వరుస ఘటనలు జరుగుతున్నాయనే ఆరోపణలు వస్తున్నాయి.

అప్రమత్తమవ్వని పోలీసులు..

రెండు నెలల కిందట సంతోష్‌నగర్‌లో అమ్మవారి ఆలయం వద్ద గుర్తుతెలియని వ్యక్తులు విధ్వంసానికి పాల్పడ్డారు. అలాగే ఇటీవల ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో దసరా నవరాత్రుల సందర్భంగా ఒక మండపం వద్ద గుర్తుతెలియని వ్యక్తులు విధ్వంసకర చర్యలకు పాల్పడ్డారు. అయితే ఈ ఘటనపై అప్రమత్తమైన పోలీసులు నిందితుడిని గుర్తించారు. సదరు నిందితుడి మతిస్థిమితం సరిగ్గా లేకపోవడంతో ఈ దుశ్చర్యకు పాల్పడ్డాడని పోలీసులు తేల్చారు. మరుసటి రోజు మాసబ్ ట్యాంక్ ప్రాంతంలో అలజడి సృష్టించే ఘటన జరిగింది. సీసీ కెమెరాల ఆధారంగా వెంటనే అసలు విషయాన్ని బయటపెట్టారు. మండపం వద్ద ఒక మాంసం ముక్క పడడానికి కుక్క కారణమనే విషయాన్ని వెల్లడించారు. అయితే ప్రశాంతంగా ఉండే సికింద్రాబాద్ ప్రాంతంలో ఎవరూ ఉహించనట్లుగా సోమవారం ఘటన చోటుచేసుకుంది. ముంబై నుంచి వచ్చిన వ్యక్తి ఇక్కడ ఆలయంలో విధ్వంసకర చర్యలకు పాల్పడటమే అనుమానాస్పదంగా ఉంది. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారు హైదరాబాద్‌లో విధ్వంసకర చర్యలకు పాల్పడుతున్నారంటే పోలీసులు ఏం చేస్తున్నారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

ఈ నగరానికి ఏమైంది!

విజుబుల్ పోలీసింగ్‌తో భయం..

పోలీసుల పహారా ఉందనే భయం నేరస్తులకు లేకుండా పోయింది. అసలు విజుబుల్ పోలీసింగ్‌ను మొత్తానికే పక్కనే పెట్టేశారనే ఆరోపణలు వస్తున్నాయి. సీసీ కెమెరాలు కూడా చాలా చోట్ల పని చేయడం లేదు. పెట్రోలింగ్ వ్యవస్థను గాలికొదిలేశారు. క్షేత్ర స్థాయిలో ఎవరేం చేస్తున్నారనే విషయాన్ని తెలుసుకునే వ్యవస్థను పక్కన పెట్టేయడంతో సిబ్బందిలో జవాబుదారీతనం కొరవడిందనే విమర్శలొస్తున్నాయి.